



ప్రేమ ఒక్కటే — నిర్వచనాలు వేరు, దేముడొక్కడే రూపాలు వేరయినట్టు. హిందూమతంలోనే నిజమైన ప్రజాస్వామ్యం వుందని, పాపం మిగిలిన వాళ్ళకు ఆ సదుపాయం లేదని వాదించే ప్రకాశం, అసలు ప్రేమే లేదంటాడు. ప్రతివాడు అందగత్తెనే ప్రేమిస్తాడేం? ముసలిదాన్నో, పసిపిల్లనో ఎందుకు ప్రేమించడు? యవ్వనంలో పేట్రేగిపోయిన ప్రేమ, వయస్సు మళ్ళిన తర్వాత ఏమవుతుంది? ప్రేమ అంటే ఆకర్షణ అనే నిర్వచనం వాడి నిర్వచనం.

"లవ్‌కి నిర్వచనం మన కామర్స్ భాషలో చెప్పాలంటే,

L — లయబిలిటీ

O — ఓవర్ డ్రాఫ్ట్

V
E — వెరీ ఎక్స్‌పెన్సివ్,

అంటే ఎలా చూసినా లవ్ అంటే "నష్టం అన్నమాట."

క్లాసులో బహిరంగంగా బల్లగుద్ది చెప్పాడు ప్రకాశం.

అలాటి ప్రకాశం ప్రేమలో పడ్డాడని తెలిసి నోరెళ్ళబెట్టాను నేను. వాడి ప్రేయసి పేరు సుహాసిని.

"ఈ రోజు నేను సుహాసిని ఇంటికి వెడుతున్నాను" ఒక రోజు ప్రకాశం నాతో అన్నాడు.

"పెళ్ళి ముహూర్తానికా?" అన్నాను నేను.

"కాదు. అది తర్వాత. ముందు వాళ్ళ పెద్దవాళ్ళకు మా విషయం చెప్పడానికి."

"అంత తొందరెందుకు?"

"తొందరకాదు. ముందు చూపు. వాళ్ళ అన్నయ్య, వాళ్ళ నాన్న, తాత అంతా మిలిటరీ వాళ్ళట. టక్కున ముహూర్తం కుదుర్చుకొచ్చి, పెళ్ళి చేసుకోమంటారని సుహాసిని భయపడుతోంది. ముందు చెప్పేస్తే ఆ గొడవుండదు."

మర్నాడు ప్రకాశం కలిసాడు.

"గొడవైపోయింది. కథ అడ్డం తిరిగింది."

"ఏమైంది?" అడిగాను.

"నిన్న సాయంత్రం సుహాసిని ఇంటికి వెళ్ళాను. ఇంటి ముందు పచార్లు చేస్తున్నాడు సుహాసిని తండ్రి. మీసాలు మెలేస్తూ నాకేసి చూశాడు. ఎంత మిలిటరీ వాడైతే మాత్రం ఇంటికొచ్చిన వాణ్ణి అలాగేనా పలకరించడం? నాకు రోషం వచ్చింది"

ఆయనే అడిగాడు నన్ను చూడగానే.

"ఎవరున్నువ్వు?"

ఏకవచన ప్రయోగంతో నాకు ఒళ్ళు మండింది.

"నువ్వేనా ఈ ఇంటి యజమానివి?" అడిగాను.

కళ్ళల్లో అగ్ని గోళాలు పేలినట్టు ఎర్రబడ్డాయి ఆయన కళ్ళు.

"గెటౌవుట్. ఐ. సే." అని అరిచాడు.

"వెళతాను. వెళ్ళేముందు ఓ మాట. మీ అమ్మాయి నేనూ ప్రేమించుకున్నాం. నీకు చెప్పి పెళ్ళి చేసుకుందామనుకున్నాం. నువ్వు ఒప్పుకునే ఘటంలా లేవు. నువ్వు కోపంలో ఏ పిచ్చి వెధవకో కట్టబెట్టక ముందే నేనే పెళ్ళాడుతాను."

పళ్ళు పటపట కొరుకుతూ, కోపోద్రేకంతో వూగిపోతూ, నా మీద కొచ్చాడు.

ఆయన పెద్ద వయస్సు, కాబోయే బంధుత్వం దృష్టిలో వుంచుకుని నేనే తమాయించుకున్నాను. బయటకు వచ్చేసాను."

"మరి ఇప్పుడేం చేస్తావు?" అడిగాను.

"పిచ్చికోపంలో సుహాసినిని ఏ బావమరిదికో, మేనల్లుడికో ఇచ్చివేయకుండా, ముందే నే చేసుకుంటాను. ఇవాళే మా వూరెడుతున్నాను. రెండు రోజుల్లో అన్నీ సిద్ధం చేసుకొస్తాను. మా అమ్మా నాన్నలకు చెప్పి ఒప్పించి కొంత డబ్బు తీసుకుని వస్తాను. వచ్చే రెండు వారాల్లో నేనూ, సుహాసిని ఒకటవుతాం" అన్నాడు.

ఆ రాత్రే ప్రకాశం తన వూరికి రైలెక్కాడు. మూడో రోజు తిరిగొచ్చాడు. మనిషి మాంచి హుషారుగా వున్నాడు.

"మా వాళ్ళు ఒప్పుకున్నారు. పెళ్ళి ఖర్చులకు పదివేలిచ్చారు. సుహాసినికి మా అమ్మ గాజులు, గొలుసు ఇస్తానంది. మా నాన్న పట్టుచీరెలు కొనడానికి మద్రాసెళ్ళాడు. మా అన్నయ్య శుభలేఖలు అచ్చేయించడానికి వెంట వెళ్ళాడు. పదిరోజుల్లో ముహూర్తం."

నాకిదంతా అబ్సర్డ్‌గా కనుపించింది. ప్రేమించుకోడానికి ఇద్దరు చాలు. పెళ్ళాడానికి ఆ ఇద్దరే చాలరు. సుహాసిని తండ్రి మిలిటరీ వాడంటున్నాడు. ఆయన వూరుకుంటాడా? ప్రకాశం తల్లిదండ్రులు, సుహాసిని పెద్దవాళ్ళతో మాట్లాడక్కర్లేదా?

నాలుగో రోజనుకుంటా ప్రకాశం హఠాత్తుగా కనపడడం మానేశాడు. కాలేజీకి రావడం లేదు. వారం రోజులు ఎదురు చూసి ప్రకాశం రూముకెళ్ళాను.

ప్రకాశం పరిస్థితి చూసి, ఆశ్చర్యం, ఆందోళన. వాడిస్థితి చూసి గుండె తరుక్కుపోయింది. ఎన్నాళ్ళనుంచో స్నానాదికాలు మానినట్టు, తిండి తిప్పలంటే లక్ష్యం లేనట్టుగా పడున్నాడు. గదిలో సిగరెట్ల వాసన. ఏదో మద్యం వాసన. ప్రకాశం పిచ్చివాడి వాలకం చూసి నా గుండె ద్రవించింది.

"ఒరే! ఏమిటిలా అయిపోయావ్!" అడిగాను. తలెత్తి చూశాడు భారంగా.

"మోసపోయాను — తీవ్రంగా మోసపోయాను. సుహాసినీ లేదు. ప్రేమాలేదు. పెళ్ళీలేదు."

పిచ్చిగా మాట్లాడుతున్న ప్రకాశం మాటల్లో సారాంశం ఇది.

ఊరునుంచి రాగానే సుహాసిని ఇంటికెళ్ళాడుట. సుహాసినిని చూడనివ్వలేదట ఆమె తండ్రి. ఘర్షణ జరిగిందట. ప్రకాశాన్ని కొట్టాడుట ఆయన. ఉద్రేకంగా ప్రతిజ్ఞ చేశాట్ట ప్రకాశం నీ కూతుర్ని ఎత్తుకెళ్ళి పెళ్ళి చేసుకుంటానని. సుహాసిని కలిసే ప్రయత్నాలు ఫలించలేదుట. మర్నాడు సాయంత్రం ఇల్లు ఖాళీచేసి ఎక్కడికో వెళ్ళిపోయాట్ట సుహాసిని తండ్రి.

ప్రకాశానికి వెయ్యి విధాల చెప్పి చూశాను. లోకంలో సుహాసిని ఒక్కతే కాదు. అంత కన్న అందకత్తెలు, చదువుకున్న వాళ్ళు వున్నారని.

"విషవలయంలో పడినవాడు, సుడిగుండంలో చిక్కుకున్నవాడు, ప్రేమలో పడ్డవాడు ఒకటే. నూటికో, కోటికో ఒకడు బయట పడ్తాడు. నాకీ విషవలయంలోనే హాయి! సుడి గుండంలోనే సుఖం! నన్ను విసిగించకు పో బ్రదర్" అన్నాడు.

నిరాధారంగా అగాధంలో పడ్డవాణ్ణి ఎవరాపగలరు? ప్రకాశానికి జీవితం మీద ఆశపోయింది. పతనాన్ని వెదుక్కుంటూ పోయిన ప్రకాశం ఓ రోజు ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఏళ్ళు గడిచాయి.

ప్రకాశం పరిస్థితి చూసి, ఆశ్చర్యం, ఆందోళన. వాడి స్థితి చూసి గుండె తరుక్కుపోయింది. ఎన్నాళ్ళ నుంచో స్నానాదికాలు మానినట్టు, తిండి తిప్పలంటే లక్ష్యం లేనట్టుగా పడున్నాడు. గదిలో సిగరెట్ల వాసన.




పట్టా పుచ్చుకుని ఉద్యోగాన్వేషణ మొదలెట్టాను. మరో కొన్ని ఏళ్ళు గడిచాయి. షేర్ బ్రోకర్ రంగారావు కంపెనీలో మేనేజరు ఉద్యోగం సంపాదించాను, పెద్ద రికమండేషన్‌తో. ఉద్యోగంలో చేరిన తర్వాతగాని తెలియలేదు. రంగారావుకు వేరే స్టాఫ్ ఎవరూ లేరు. ప్యూన్, గుమాస్తా, పి.ఏ, మేనేజరు అన్నీ నేనే. ఉదయం పాలబూత్‌నుంచి పాలు తీసుకురావాలి. మార్కెట్టు నుంచి కూరలు, పదినుండి పన్నెండు వరకు ఉత్తరాలు చూడాలి. సాయంత్రం అయిదువరకు రెస్టు. రంగారావుగారు ఉత్తరాలు డిక్టేట్ చేస్తాడు. బ్యాంకులో కట్టాల్సిన డబ్బు, చెక్కులు అప్పుడే నాకిస్తాడు. రాత్రి ఎనిమిది వరకు ఏ పని చెప్పినా చేస్తూ అక్కడే వుండాలి.

గతిలేని నాకు ఈ మతిలేని ఉద్యోగం చెయ్యక తప్పడం లేదు.

రంగారావు నాలుగురోజులు "చీమలపల్లి" అడవుల్లో వేటకు వెడుతున్నాడంటే సంతోషించాను. ఈ నాలుగు రోజులు నాకు రెస్ట్. నా ఆనందం ఎక్కువ సేపు నిలవ లేదు. ఆ "చీమలపల్లి" అడవికి నేనూ కూడా వుండాలట.

మనస్సులో తిట్టుకుంటూ, ఏడుస్తూ జీపు ఎక్కాను. రంగారావు మూగ చెల్లెలు ఆ జీపులోనే వుంది. తల మీద బురఖాలా ఓ ముసుగు. ఆవిడ అందం ఎవరైనా చూసి పోతారనో ఏమో!

"చీమలపల్లి" చేరుకునేసరికి రాత్రయింది. కలప మిల్లు దగ్గర ఓ ఇంట్లో మకాం. తెల్లారు ఝామున లేచి, పాలు తీసుకువచ్చే డ్యూటీ ఇక్కడా తప్పలేదు.

పాలు తీసుకు వస్తూ వుంటే ఓ వింత విషయం చూశాను. పాలవాడి దగ్గర ప్రకాశం! పశువులకు గడ్డి వేస్తూ.

"ఒరే ప్రకాశం" అరిచాను.

ఆశ్చర్యంతోనూ, సంభ్రమంతోనూ నన్ను కౌగలించుకున్నాడు.

"ఇక్కడికెలా వచ్చావని" అడిగాను. చెప్పడం ప్రారంభించాడు.

"గమ్యం లేకుండా చాలా రోజులు తిరిగాను. తిరుగుతూ, తిరుగుతూ చీమలపల్లి వచ్చాను. ఈ అడవి,

ఈ కొండవాగులు, ఈ పచ్చటి చెట్లు, ఈ నిశ్శబ్దం నాకు నచ్చాయి. సుహాసినిని తల్చుకుంటూ..."

"సుహాసినిని మర్చిపోలేదన్నమాట. ఆ అమ్మాయి ఎవర్నో పెళ్ళాడి సుఖంగా వుంటుందీ పాటికి. నువ్వేమో !"

"పాడుకుంటూ తిరిగాను. ఆకలీ, దాహం, నీటిమీద దృష్టిలేని నాకు పరిసరాల పట్టింపు కూడా పోయింది. ఈ పాలాయన ఇంటి ముందు పడిపోయాను. ఆయనే నాకు వైద్యం చేయించాడు. అప్పట్నించి ఇక్కడే వుంటున్నాను."

మాకు తెలియకుండానే మా దారి ఇంటివైపు సాగింది. మాట్లాడుకుంటూ ఇంటికొచ్చాము.

ప్రకాశం బొమ్మలా నిలబడిపోయాడు, ఇంటి ముందు.

హఠాత్తుగా ఆగిపోయిన ప్రకాశం కళ్ళు తిప్పకుండా అటే చూస్తున్నాడు.

నేనటు చూశాను. రంగారావుగారి మూగచెల్లెలు.

కొన్ని నిమిషాలు స్థాణువులా నిలబడ్డ ప్రకాశం ఒక్కసారిగా అరిచాడు.

"సుహాసినీ!"

ఆ అరుపుకు దిక్కులు ప్రతిధ్వనించాయి. రంగారావుగారి చెల్లెలు పరీక్షగా ప్రకాశాన్ని చూసి లోపలికి పరుగెత్తింది. సంభ్రమంతో చూస్తున్న నాకు అంతకన్న ఆశ్చర్యకరమైన విషయం ఇంకోటి జరగడంతో చేష్టలుడిగి, నోటమాటరాక జడపదార్థంలా అయిపోయాను.

రంగారావుగారు దూకుడుగా బయటకు వచ్చాడు.

"ఒరే! నీ గురించేరా నేను కాచుకున్నది. నువ్వు ఇక్కడెక్కడో వున్నట్టు తెలిసే ఇక్కడికొచ్చాను. ఇంత తొందరగా దొరుకుతావను కోలేదు."

భీకరంగా అరుస్తూ ప్రకాశం మీద కొచ్చాడు.

ఎనుబోతులా ప్రకాశాన్ని ఢీకొన్నాడు. కాలితో తన్నాడు. చేతులతో కొట్టాడు. ఒక్క నిమిషం. ప్రకాశం తేరుకున్నాడు. బలంగా రంగారావు చేతులతో ఒడిసి పట్టుకున్నాడు. ఒక్క విదుల్పుతో రంగారావు లోనికి పరుగెత్తాడు. కొన్ని క్షణాల్లో తిరిగొచ్చాడు. ఆయన చేతిలో తుపాకి, కన్నుమూసి తెరిచే లోపల ఆ తుపాకీ నిప్పులు కక్కింది. అదే సమయంలో.

"అన్నయ్యా!" అని అరిచింది రంగారావు మూగ చెల్లెలు.

అదిరిపడి చూశాడు రంగారావు.

"నువ్వు — నువ్వు మాట్లాడగలవా?"

ప్రకాశరావు చేతి పక్కనుంచి గుండు దూసుకుంటూ పోయింది.

జరుగుతున్నది ఒక్కటీ నాకర్థం కావడంలేదు.

ప్రకాశరావు 'సుహాసినీ" అని పిలిచింది రంగారావు చెల్లెల్ని. ఆమె మూగది కాదు. సుహాసిని రంగారావు కూతురని చెప్పాడే ఆ రోజుల్లో.

"అన్నయ్యా! ఆయన్ను చూడన్నయ్యా! మోసం చేసే మనిషిలా వున్నాడా?" ఏడుస్తూ ప్రశ్నించింది సుహాసిని.

"మరి... మరి... ప్రియంవదను మోసం చేసిన వాడెవరు?" అనుమానంగా చూస్తూ అన్నాడు రంగారావు.

వారి ముగ్గురు మధ్య అగాధంలా అపార్థం ఏదో వుందని నా కనిపించింది. ఆ అస్తవ్యస్త పరిస్థితిల్లో నా మెదడు పనిచేయడం మరిచిపోయింది. కాని ప్రకాశరావును మోసగాడుగా అనుమానించడం నాకు బాధ అన్పించి ప్రకాశరావును డిఫెండ్ చేస్తూ అన్నాను.

"అయ్యా! ప్రేమకోసం త్యాగాలు చేస్తారంటారు. ప్రకాశం విషయంలో నే స్వయంగా చూశాను. తన పెళ్ళి గురించి డబ్బు తెచ్చాడు. పెద్దల్ని ఒప్పించాడు. తల్లి నగలివ్వ డానికి నప్పుకుంది. ఆ సమయంలో ప్రకాశాన్ని ప్రేమించిన మనిషి వూరినుంచి లేచిపోయింది. అప్పట్నించి జీవచ్ఛవంలా బతికాడు — వీడు."

రంగారావుగారు తొందరగానే తేరుకున్నాడు.

"సుహాసిని నా చెల్లెలు. ఆశ్చర్యపడు తున్నావా? ప్రకాశం సుహాసినిని నా కూతురను కున్నాడు. సుహాసిని నా చిట్టి చెల్లెలు. ఆ వయసుండే నా కూతురు ప్రియంవద. మీ కాలేజీలోనే చదువుతూండేది. మీది కామర్సు. ఆమెది సైన్సు గ్రూపు. ఆమెదారి తప్పుతున్నట్లు తెలిసి తోటలో తిరుగుతూ వుంటే, ప్రకాశం వచ్చాడు. ఆ కోపంలో ఏదో అన్నాడు. ప్రియంవదను ప్రేమించిన వాడేనని అనుకున్నాను. ప్రియంవద నన్ను మోసం చేసింది. వాడితో ఇంట్లో నుంచి పారిపోయింది. అది ప్రకాశమే ననుకున్నాను. సంవత్సరం తర్వాత ప్రియంవద చిరిగిన విస్తరాకులా తిరిగొచ్చింది. అహంకారంతో ఇంట్లోంచి తరిమేశాను. రోడ్ల మీద అడుక్కుంటూందని తెలిసి ఇంటికి తీసుకువచ్చాను. అప్పటికే శిథిలమైన ఆమె నాకు దక్కలేదు. పువ్వులాంటి ప్రియంవద బొగ్గులాగా మారడానికి కారణమైన ప్రకాశాన్ని చంపాలనుకున్నాను. ఆ కసితోనే ఇన్నాళ్ళూ వూరూరా గాలించాను. ఆఖరికి నీమల పల్లి అడవుల్లో వున్నట్లు తెలిసి ఇక్కడికి వచ్చాను."

ప్రకాశం చేతినుంచి కొద్దిగా రక్తం వస్తూంది. చేతితో ఆ రక్తాన్ని అదిమి పట్టుకుని లేచి అన్నాడు.

"ప్రియంవదా? సుహాసిని మీ అమ్మాయే అని పొరపడ్డాను. ప్రియంవద ఎవరో నాకు తెలీదు."

"ప్రేమలో పడ్డమనిషి నిగిలిన వివరాలు అనవసరమనిపిస్తుంది." అన్నాడు రంగారావు. ఆయన చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్నట్టు కనిపిస్తున్నాడు.

"ప్రేమావేశంలో మీరిద్దరు వాస్తవాన్ని మరిచిపోయారు. ఒక్క క్షణం ఓపిక పట్టి నాకు వివరిస్తే ఇన్నాళ్ళ ఈ వేదన, మనస్తాపం తగ్గివుండేవి. నా తప్పూ వుంది. నాది కోపావేశం. సుహాసిని తన ప్రేమ భగ్నమయిందని, లేదా అవుతుందని మూగనోము పట్టింది. మాటపడిపోయిందనుకున్నాము."

రంగారావు మాటలకడ్డం వచ్చి, సుహాసిని అంది.

"నేను మాటపోయినట్టు నటించలేదన్నయ్యా! ప్రకాశంగార్ని చూడగానే ఆ సంభ్రమంలో మర్చిపోయిన నా మాట మళ్ళీ తిరిగి వచ్చేసింది. మళ్ళీ కనపడని ప్రకాశంగార్ని, తలచుకునో, పగిలిన బొమ్మలాంటి ప్రియంవద దురవస్థ చూసో, నా మాట మరుగున పడిందప్పుడు.

రంగారావు గబుక్కున లేచాడు. ప్రకాశరావు దగ్గరకు వచ్చి నెమ్మదిగా లేవనెత్తాడు. ఆయన కళ్ళలో నిలిచివున్న సిగ్గు, పశ్చాత్తాపం, గ్రహించాడో ఏమో ప్రకాశం రంగారావు చేతులు పట్టుకున్నాడు ఆప్యాయంగా.

వాతావరణం ఆహ్లాదంగా మారింది. తర్వాత ప్రకాశాన్ని అడిగాను. "లవ్ అంటే నీ నిర్వచనం గుర్తుందా?" ప్రకాశం నవ్వి అన్నాడు. "ఇంత జరిగాక ఆ కామర్స్ నిర్వచనం మార్చక తప్పదు."

"అదేమిటో" అన్నాను నేను.

"L — లైఫ్

O — ఒడిస్సీ

V — వైటాలిటీ

E — ఎనర్జీ

లవ్ ఈజ్ లైఫ్స్ ఒడిస్సీ ఆఫ్ వైటాలిటీ అండ్ ఎనర్జీ."

"అంత ఇంగ్లీషు నాకు రాదు. తెలుగులో చెప్పు" అన్నా.

"ప్రేమంటే శక్తివంతమైన, ఉత్తేజకరమైన, సాహసవంతమైన ప్రయాణం."

ప్రేమకు వున్న అనేకానేక నిర్వచనాలలో ఇదే కొత్తగా వున్నట్టనిపించింది నాకు. ఆ లిస్టులో ఇదొకటి.

*

